ప్రజాశక్తి

శుక్రవారం 14 జూన్ 2024 5 శ్రీ సత్యసాయి





జెఎన్‌టియుకు ఎనిమిది పరిశోధన ప్రాజెక్టులు

రూ.86లక్షలు మంజూరు

రెండేళ్లలో పూర్తి చేసేలా చర్యలు

విసి జివిఆర్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియుకు ఎనిమిది పరిశోధన ప్రాజెక్టులు దక్కాయని ఉపకులపతి జివిఆర్.శ్రీనివాస రావు గురువారం తెలిపారు. నూతన పరిశోధన ప్రాజెక్టుల ద్వారా వర్శిటీలో పరిశోధనలకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రెండేళ్ల కాలపరిమితిలో వీటిని పూర్తి చేయాలనే నిబంధనలతో జాతీయ ఉన్నత విద్యా మిషన్ (రూసా) కింద మంజూరు అయిన ప్రాజెక్టులకు రూ.86లక్షల నిధులు వర్శిటీకి రానున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రీసెర్చ్, ఇన్నోవేషన్, క్వాలిటీ ఇంప్రూవ్ మెంట్ కింద నిధులు మంజూరు అయ్యాయన్నారు. విభాగాల వారీ చూస్తే సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బి.అజిత నానో కాంక్రీట్ స్థిరత్వం అంచనా వేసేందుకు ప్రాజెక్టు మంజూరు అయ్యిందన్నారు. ఎలక్ట్రానిక్ విభాగం నుంచి డా॥ ఎస్.అరుణమస్తానికు మూర్ఛ రోగులకు తక్కువ ఖర్చుతో ఇంటి వద్దనే పరీక్షలు చేసుకునే పరికరాలు తయారు చేయడానికి ప్రాజెక్టు మంజూరు అయ్యిందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి డా॥డి.విష్ణు వర్ధన్‌కు క్లిష్టమైన జబ్బులను గుర్తించడానికి డీప్ లర్నింగ్ అల్గోరిటెమ్స్‌ను ఉపయోగించి మెడికల్ ఇమేజ్ అనాసిలాస్ చేయడానికి ప్రాజెక్టు మంజూరు అయ్యిందన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగం బి.దిలీప్ కుమార్‌కు బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్ ఎలక్ట్రోడ్ మెటీరియల్, నీటి నుంచి హైడ్రోజన్, ఆక్సిజన్‌ను వేరు చేయడానికి ఉపయోగించే ఎలాక్ట్రోడ్ మెటీరియల్‌ను తయారు చేయడానికి ప్రాజెక్టు మంజూరు అయిందన్నారు. యస్‌వి.సత్యనారాయణకు ఇథనాల్ బయో ఫ్యూయల్ వాడడానికి కావాల్సిన సపరేషన్ టెక్నిక్స్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని పొందే పరికరాలను టెస్ట్ చేయడంకు ప్రాజెక్టు దక్కిందన్నారు. గణిత విభాగం నుంచి ఆర్.భువన విజయ మ్యాగ్నాటో హైడ్రానిక్ కనెక్టివేట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఇన్ మైక్రోపోలార్ ఫ్లూయిడ్స్ అనే ప్రాజెక్టు మంజూరు అయ్యిందన్నారు. గణిత విభాగం నుంచి ఇ.కేశవరెడ్డికు వయసులో పెద్ద వారు నడకలో కింద పడకుండా ఉండడానికి ఐఒటి మెషిన్ లర్నింగ్‌ను ఉపయోగించేలా ప్రాజెక్టును తయారు చేసేందుకు అవకాశం లభించిందన్నారు. సివిల్ విభాగం నుంచి సి.శశిధర్‌కు ఐరన్ ఓర్ వేస్ట్‌ను కాంక్రీట్‌లో ఉపయోగించి కాంక్రీట్ స్థిరత్వాన్ని పెంచే ప్రాజెక్టు దక్కిందన్నారు. ప్రాజెక్టులు మంజూరు అయిన అధ్యాపకులకు విసి శ్రీనివాస రావుతో పాటు రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌లు అభినందనలు తెలిపారు.

వాన..మూడింతలు అధికం..!

అనంతలో 305.3 శాతం... శ్రీసత్యసాయిలో 201.6 శాతం ఎక్కువ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



గతేడాది మొత్తం తీవ్ర దుర్భిక్షాన్ని చవిచూసిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈసారి సీజన్ ప్రారంభంలోనే అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. అటు అనంతపురం, ఇటు సత్యసాయి జిల్లాలో రెండు చోట్ల జూన్ ప్రారంభం నుంచే అధిక వర్షాలు నమోదవుతున్నాయి. ప్రతి రోజూ ఏదోక చోట వర్షపాతం నమోదవుతేనే ఉంది. సాధారణం కంటే అనంతపురం జిల్లాలో మూడింతలు అధికంగా వర్షపాతం నమోదవగా, సత్యసాయి జిల్లాల రెండింతలు అధికంగా వర్షపాతం నమోదయింది. సీజన్ ప్రారంభంలోనే వస్తున్న వర్షాలతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

305.3 శాతం అధికం

అనంతపురం జిల్లాలో 31 మండలాల్లో పడిన వర్షపాతం సాధారణం కంటే 305.3 శాతం అధికంగ పడింది. ఈ జిల్లాలో జూన్, జులై రెండు మాసాల్లో పడేంత వర్షపాతం ఈ నెలలో ఇప్పటికే పడింది. జూన్, జులై నెలలు కలిపి అనంతపురం జిల్లాల సాధారణ వర్షపాతం 124.9 మిల్లీమీటర్లు అయితే ఇప్పటికే అనంతపురం జిల్లాలో 137 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. మండాల వారీగా చూస్తే అత్యధికంగా కూడేరు మండలంలో 934.5 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. ఇక్కడ ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 15.8 మిల్లీమీటర్లు అయితే 163.4 మిల్లీమీటర్లు వానపడింది. బెళుగుప్పలో 646.7 శాతం అధికంగా నమోదయింది. ఇక్కడ సాధారణ వర్షపాతం 30.4 మిల్లీమీటర్లు అవుతే 227 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. వజ్రకరూరులో 625 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 29.3 మిల్లీమీటర్లు అయితే 212.6 మిల్లీమీటర్లు నమోదయింది. ఇలా 32 మండలాల్లోనూ సాధారణం కంటే వర్షపాతం అధికంగా నమోవడం గమనార్హం. జిల్లా మొత్తంగా చూసినప్పుడు ఇప్పటి వరకు 33.8 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 137 మిల్లీమీటర్లు నమోదయింది. అంటే సాధారణం కంటే 305.3 శాతం అధికంగా పడింది.

సత్యసాయిలో 201.6 శాతం అధికం

సత్యసాయి జిల్లాలోనూ వర్షపాతం సాధారణం కంటే 201.6 శాతం అధికంగా పడింది. ఇక్కడ 32 మండలాలకుగానూ 30 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదయింది. తక్కిన మండలాల్లోనూ మంచి వర్షపాతమే నమోదైంది. సత్యసాజిల్లాలో సాధారణ వర్షపాతం 36.6 మిల్లీమీటర్లు కాగా పడింది 110.4 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 201.6 శాతం అధికంగా పడింది. సత్యసాయి జిల్లాలో బత్తలపల్లిలో అత్యధికంగా 592 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. 33.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికిగానూ 230.6 మిల్లీమీటర్లు నమోదయింది. అగళి మండలంలో మాత్రం సాధారణ వర్షపాతం నమోదయింది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 44.9 మిల్లీమీటర్లుకాగా పడిన వర్షపాతం 50.2 మిల్లీమీటర్లు. 11 శాతం మాత్రమే అధికంగా పడింది. తక్కిన అన్ని మండలాల్లోనూ సాధారణం కంటే అధికంగానే వర్షపాతం నమోదయింది.

నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



చిన్నారిని అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి క్రిస్టినా సియారా పేరు నమోదు చేయడంపై కలెక్టర్ వి.వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గుంతకల్లు పట్టణం మోదీనాబాద్‌కు చెందిన రైల్వే ఉద్యోగి (ఎలక్ట్రికల్ శాఖ) పి.సుధాకర్, సింధుల నాలుగు నెలల చిన్నారి క్రిస్టినా సియారా అతి చిన్న వయసులోనే ఫ్లాష్ కార్డ్‌లు (ఆల్ఫాబిట్స్, అనిమల్స్, ఫ్రూట్స్, బర్డ్స్ లాంటివి) గుర్తించడంతో నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసింది. గురువారం నాడు అనంతపురం కలెక్టరేట్లో చిన్నారి క్రిస్టినా సియారాతో కలిసి తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిశారు. చిన్నారిని 'వెరీగుడ్' అంటూ కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారికి ఎంతో ప్రతిభ ఉందని, భవిష్యత్తులో కూడా చిన్నారికి ప్రోత్సాహం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారి తల్లితండ్రులు మాట్లాడుతూ 149 ఫ్లాష్ కార్డ్‌లను గుర్తించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తమ కూతురు క్రిస్టినా సియారా పేరు నమోదు చేసిందన్నారు. ఇంతకుముందు కర్నాటకకు చెందిన చిన్నారి 125 ఫ్లాష్ కార్డ్‌లను గుర్తించిందని, ఆ పాప రికార్డును తమ కూతురు తిరగరాసిందని తెలిపారు. ఈనెల 7వ తేదీకి చిన్నారికి 3 నెలల 15 రోజుల వయస్సు అన్నారు. అతి చిన్న వయసులోనే వరల్డ్ రికార్డ్ నెలకొల్పి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి సర్టిఫికేషన్ అందుకుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులతో రాఘవేంద్ర

ప్రజాశక్తి-అనంతపురం

ఎపిఎస్ఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా కొత్తకోట హరీష్, ప్రధాన కార్యదర్శిగా బండి శివలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురం నగరంలోని ఏపీఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ప్రధాన అజెండాగా ఏపీఎస్ఎఫ్ పని చేస్తోందన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా వ్యవస్థలో జరుగుతున్న ఫీజు దోపిడీకి వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన, హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా భవిష్యత్తులోనూ ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్ నగర అధ్యక్షులు గురుసాయి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి బోధనలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి బాబా బోధనలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఛత్తీస్‌ఘడ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాలకు చెందిన శ్రీసత్యసాయి భక్తులు వందలాది మంది ఆయా రాష్ట్రాల నుంచి గురువారం పర్తియాత్రగా ప్రశాంతి నిలయం చేరుకున్నారు. ఉదయం సాయి కుల్వంత్ హాలులో శ్రీసత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ఏటా పర్తియాత్రగా ప్రశాంతి నిలయం వస్తున్నామన్నారు. శ్రీసత్యసాయి సేవా సమితి ద్వారా బాల వికాస్ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. బాబా బోధనలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ప్రశాంతి నిలయంలో ప్రశాంతత లభిస్తుందన్నారు. సాయంత్రం బాలవికాస్ విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. తాము రెండు రోజుల పాటు సాయి సన్నిధిలోనే గడుపుతామని వారు తెలిపారు.



నృత్యం చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు

అరకొర సౌకర్యాల మధ్య మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి-సోమందేపల్లి

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే మండలంలోని పలు ప్రభు త్వ పాఠశాలల్లో గురువారం అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. జగన్ ప్రభుత్వ హయాంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలను ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులకు కట్ట బెట్టడం, ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఏర్పడడంతో పలు ఏజెన్సీ నిర్వాహకులు పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించడానికి పూర్తిస్థాయిలో ముందుకు రాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటవడంతో భోజన ఏజెన్సీలు వారికి సంబంధించిన వంట సామగ్రి, తదితర వస్తువులను తీసు కెళ్లారు. దీనికి తోడు ఏజెన్సీ నిర్వాహకులు పాఠశాల వైపు రాకపోవడంతో కొన్ని పాఠశాలల్లో ప్రధానో పాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన వస్తువులు తెప్పించి కొద్దిగ ఆలస్యమైనా విద్యార్థుల కు మధ్యాహ్న భోజనం అందించారు. మధ్యాహ్న భోజనంపై ఎంఇఒ-2 ఆనంద్‌ను వివరణ కోరగా ప్రతి పాఠశాలలో పిల్లలకు ఖచ్చితంగా మధ్యాహ్న భోజనం అందించాలని ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామని, ఎవరైనా పిల్లలకు భోజనం అందించకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సోమందేపల్లి పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

పాంచజన్య పాఠశాలలో వినూత్న ఆహ్వానం

పిల్లలకు బెలూన్లు ఇచ్చి స్వాగతం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వ్యాప్తంగా గురువారం పాఠశాల లు పునఃప్రారంభమయ్యాయి. దాదాపు రెండు నెలల పాటు వేసవి సెలవుల్లో మునిగిపోయిన విద్యార్థులు పుస్తకాలు చేతపట్టి బడిబాట పట్టారు. ఈ సందర్భగా పట్టణంలోని పాంచజన్య పాఠశాల యాజమాన్యం వినూత్నంగా ఆలోచించి మొదటి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయుల చేత బెలూన్లు అందజేసి స్వాగతం పలికారు. పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ మొదటి రోజు విద్యార్థులు పాఠశాలకు రావడంతో వారికి స్వాగతం పలికే ఉపాధ్యాయులతో బెలూన్లు అందజేసినట్లు తెలిపారు. చిన్నారులకు ఆట పాటలతో విద్యాభ్యాసం చేయించడమే పాఠశాల ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, ఏఓ భాస్కర్, హెచ్‌ఎం గాయత్రి, ఎహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఎంజిఎం పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప చదువు ప్రాముఖ్యతపై ప్రార్థన సమయంలో గీతం ఆలపించి విద్యార్థులకు స్వాగతం పలికారు. రెండు నెలల అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు రావడంతో సందడి వాతావరణం నెలకొంది.



విద్యార్థులకు బెలూన్లు అందజేసి స్వాగతం పలుకుతున్న పాంచజన్య పాఠశాల ఉపాధ్యాయులు

రొద్దంలో తెలుగుతమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్రంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మకు మంత్రి పదవి దక్కడంతో గురువారం మండల వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో టిడిపి నాయ కులు, కార్యకర్తలు, టపాసులు పేల్చారు. టీ కొట్టుల వద్ద స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో చంద్ర శేఖర్, నాగేంద్ర, రాజప్ప, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దమంతూరు పంచాయతీలోని పి.రొప్పాల గ్రామంలో తెలుగుతమ్ముళ్లు బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఎం. కొత్తపల్లి గ్రామంలో సర్పంచి నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బికె పార్థసారథి నాయకత్వం వర్ధిల్లాలి, సవితమ్మ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. నల్లూరు, తురకలాపట్నం, తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, రాము, ఎం.కొత్తపల్లి సర్పంచి నాగరాజు, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.




రొద్దంలో సంబరాలు చేసుకుంటున్న తెలుగుతమ్ముళ్లు

వారపుసంత, వాహనాల పార్కింగ్ వసూళ్లకు వేలం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచి ఆదినారాయణ అధ్యక్షతన వారపు సంత, వాహనాల పార్కింగ్ ఫీజులు వసూలు చేయడానికి 9 నెలల కాల పరిమితికి సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. వేలం పాటలో వాహనాల పార్కింగ్ ఫీజు వసూలును సైఫులా అనే గుత్తేదారుడు రూ. 32.25లక్షలకు దక్కించుకొన్నాడు. వారపు సంత వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో వేలం వాయిదా వేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ శివన్న, పంచాయతీ కార్యదర్శులు రమేష్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.





మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల

మంత్రులకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-మడకశిర

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులను గురువారం మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఉరవకొండ ఎమ్మెల్యే మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్‌ను కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. అలాగే మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన కింజారపు అచ్చెన్నాయుడుని కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానిం చారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి మంత్రులు తమ వంతుగా కృషి చేయాలని కోరారు.

ఆదిరెడ్డిపాలెం పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-మడకశిర

వేసవి సెలవుల అనంతరం పాఠశాల పున:ప్రారంభం రోజునే మండల విద్యాశాఖ అధికారి-1 శ్రీనివాసభాస్కర్ మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఆయన గురువారం పట్టణంలోని ఆదిరెడ్డిపాలెం ఎంపిపి పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అయితే రికార్డులను పరిశీలించిన అనంతరం సక్రమంగా రికార్డులు లేకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎంఇఒ వెంట ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు ఉన్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఇఒ శ్రీనివాసభాస్కర్

సమస్యల వలయంలో ప్రభుత్వ బడులు.!

అర్థాంతరంగా ఆగిన భవన నిర్మాణాలు.. కనీస సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. మండల వ్యాప్తంగా మొత్తం 42 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 26 ప్రాథమిక పాఠశాలలు, 16 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 30 పాఠశాలలు నాడు-నేడు కింద ఎంపికైనట్లు మండల విద్యా శాఖ అధికారి(ఎంఇఒ) మల్లికార్జున తెలిపారు. నాడు-నేడు ద్వారా ఉద్దేహాల్ గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలకు రూ. 14 లక్షలు మంజూరు కాగా భవన నిర్మాణం పూర్తయినా ఇంకా రంగులు, తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయాల్సి ఉండడడంతో ఆ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఇక సింగేపల్లి ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. అలాగే నిధులు లేక బొమ్మనహాల్, చంద్ర గిరి, ఉంతకల్, దేవగిరి, కల్లుహోల, గోవిందవాడ, దర్గాహొన్నూరు, శ్రీధర్‌గట్ట జిల్లా పరిషత్ హైస్కూళ్ల లో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. నేమకల్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. అందులో 500 మంది విద్యార్థులు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన పాఠశాల భవనాలు పునాదులకే పరిమితమయ్యాయి. దీంతో విద్యార్థులు ఆరుబయట విద్యా భ్యాసం సాగిస్తున్నారు. లింగదహాల్, దేవగిరి, చంద్రగిరి, నేమకల్ పాఠశాలల్లో నీటి సౌకర్యం లేకపోవ డంతో, అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నా బాలికలు మల మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా పాఠశాలలకు నిధులు మంజూరు చేయించి అర్థాంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



లింగదహాల్ హైస్కూల్‌లో తాగునీటి కొళాయిల దుస్థితి



హితేశ్వరరెడ్డి

నీట్‌లో మెరిసిన కదిరి విద్యార్థి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతులు సి.నిత్య నందరెడ్డి, ఇందిర కుమారుడు సి. హితేశ్వర్ రెడ్డి నీట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాడు. నీట్‌లో ఆల్‌ఇండియా ర్యాంక్ 9412 సాధించడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-హిందూపురం

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పిచ్చిన వారమవుతామని జిల్లావైద్యాధికారి డాక్టర్ మంజువాణి అన్నారు. గురువారం హిందూపురం జిల్లా స్థాయి ఆసుపత్రిలో వైద్యాధికారులకు క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మంజువాణి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.లింగన్న, జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ కెసికె.నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతు మారుతున్న ప్రజల జీవనశైలి వల్ల రోజు రోజుకూ క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల పెరుగుతోందన్నారు. లక్షణాలు లేని క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించడమే ఈ శిక్షణ కార్యక్రమ ముఖ్య ఉద్దేశన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు, గ్రామాలలో అనునిత్యం పర్యటించే ఆరోగ్య కార్యకర్తలు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చాపక్రింద నీరులా పాకుతున్న క్యాన్సర్ వ్యాధిని మొక్కదశలోనే తుడిచిపెట్టి వారికి ఉజ్వల భవిష్యత్తు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వైద్యులు పద్మజ, విజయబాబు, ఆయీషా తదితరులతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ శివశంకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం మండలంలోని మెడికల్ ఆఫీసర్లకు, సిహెచ్‌ఒ, ఎఎన్‌ఎంలకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకర్ మాట్లాడతూ డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సెల్వియా సాల్మాన్ ఆధ్వర్యంలో జూలై 10వ తేదీ వరకు ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా క్యాన్సర్‌లోని రకాలను వివరించారు. క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నివేదిత, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, డాక్టర్లు శైలజ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



సామాజిక సేవకులను సన్మానిస్తున్న నాయకులు

సామాజిక సేవకులకు పురస్కారాలు

ప్రజాశక్తి -హిందూపురం

సామాజిక సేవకులకు విద్యా ప్రదాత సేవా పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ముస్లిం నగారా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఆధ్వర్యంలో సత్య సాయి జిల్లా రచయితల సంఘం పట్టణ అధ్యక్షుడు కల్లూరు రాఘవేంద్ర రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు. కరోనా సమయంలో కోవిడ్ బాధితులను అన్ని విధాల ఆదుకోవడంతో పాటు విద్యార్థులను చైతన్యం చేస్తూ వారికి సహాయ సహకారాలు అందించిన సిఎంఆర్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ మల్లికార్జున, చాంద్‌బాషాలకు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ తరపున ఈ పురస్కారాలను అందజేశారు. అనంతరం వారిని సన్మానించారు. ప్రతి ఒక్కరు సేవ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉబేదుల్లా హుసేన్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, అబ్దుల్ సలామ్, మౌలానా రిజా ఉద్ రహమాన్, మౌలానా సాజిద్, ఆర్‌ఎంఎస్ షఫీ, షబ్బీర్, ముస్తఫా ఖాన్, అల్ అమీన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన చిత్రపటానికి టిడిపి శ్రేణులు పాలాభిషేకం చేశాయి. గురువారం స్థానిక హనుమాన్ సర్కిల్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామకోటి మాట్లాడుతూ బాబుతో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే సత్తా సిఎం చంద్రబాబునాయుడికి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా నాయకులు రామాంజనేయులు, కురుబ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేశాని ఆదినారాయణ, తలమర్ల కమ్మన్న, నాయకులు పార్థసారథి, పాపారాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ప్రజాశక్తి-రొద్దం

కుటుంబ సమస్యల నేపథ్యంలో మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రొద్దంకు చెందిన వివాహిత మంగలి అంజలి(30) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ప్రసాద్ తెలిపిన వివరాలు.. నాయీ బ్రాహ్మణుడైన నేను వృత్తి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడినని, తనకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం కాగా ముగ్గురికీ వివాహం చేశానన్నారు. పెద్ద కుమార్తె అంజలి(30)కి 12 ఏళ్ల క్రితం రొద్దం గ్రామానికి చెందిన నాగభూషణకు ఇచ్చి వివాహం చేశానన్నారు. ఆమె రొద్దంలో ఉన్న టింబక్టు కలెక్టివ్ సంస్థలో చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించేదని, వారికి 8 ఏళ్ల కుమార్తె కీర్తన, నాలుగేళ్ల కుమారుడు రిషివర్ధన్ సంతానం ఉన్నారన్నారు. వివాహమైనప్పటి నుంచి వారి సంసారం సాఫీగా సాగిందన్నారు. నాగభూషణ కియా కంపెనీలో పని చేస్తున్నాడని, అయితే వేతనం ఇంటి ఖర్చులకు ఇవ్వకుండా మద్యం, ఇతర అవసరాలకు వినియోగించేవాడన్నారు. ఈ క్రమంలో అప్పులు కూడా చేశాడన్నారు. ఈ విషయమై భర్తకు పలుమార్లు చెప్పినా అతడిలో మార్పు రాకపోవడంతో అంజలి గత ఆదివారం మధ్యా హ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాస్మోల్ తాగిందన్నారు. గమనించిన ఆమె అత్త చుట్టుపక్కల వారి సాయంతో అంబులెన్స్‌లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిందన్నారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అదే రోజు అనంతపురం ఆసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. అయితే చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం 6 గంటలకు అంజలి మృతి చెందింది. దీంతో ఆమె ఇద్దరు పిల్లలు ఏడవడం చూసిన ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వలిబాషా తెలిపారు.

క్షతగాత్రుడికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని కె.పూలకుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జి.రాము ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పందించారు. క్షతగాత్రుడికి వైద్యఖర్చుల నిమిత్తం నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్ చేతుల మీదుగా రూ. 20వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అంజినప్ప నాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన ఓ చేనేత కార్మికుడు గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. కాలనీకి చెందిన రామాంజినేయులు కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో రామాంజినేయులు గురువారం ఉదయం కుటుంబసభ్యులతో మాట్లాడుతూ ఉన్నఫలంగా కుప్పకూలాడు. ఆ సమయంలో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్, ఆ వార్డు టీడీపీ అధ్యక్షులు గోసలశ్రీరాములు, సూర్యనారాయణ తదితరులు రామాంజినేయులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతునికి భార్య సురేఖ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



మృతుడికి నాయకుల నివాళి

మంత్రిని కలిసిన పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ కలసి అభినందించారు. విజయ వాడలోని మంత్రి కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ కలసి ఆత్మీయ ఆలింగనం చేసుకొని అభినందించారు. ఈసందర్భంగా వారు నియోజకవర్గ పరిస్థితులపై చర్చించుకున్నట్లు నాయకులు తెలిపారు. కలసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి వీరు కృషి చేయాలని ఆశిస్తున్నట్లు స్థానిక నాయకులు చెప్పారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను, పట్నం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పోలీసుస్టేషన్లలో రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ యతీంద్ర, ఎస్ఐ నరసింహుడు, పోలీసులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ



ర్యాలీలో అంగన్వాడీలు, చిన్నారులు

'అంగన్వాడీ పిలుస్తోంది'

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని రివర్స్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో కదిరి సిడిపిఒ రాధిక ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రెండు సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలకు అంగన్వాడీ పిలుస్తోంది పేరుతో వారిని కేంద్రంలో చేర్పించుకొని విద్యా బోధన చేయడం జరుగుతుందని సిడిపిఒ తెలిపారు. తల్లులు తమ పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని సూచించారు. అనంతరం కాలనీలో అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత, పాఠశాల హెచ్‌ఎం లావణ్య, అంగన్వాడీలు విజయలక్ష్మి, విజయ కుమారి, సంధ్య, సుగుణ, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఈనెల 17న బక్రీద్ ఈద్-ఉల్-అధా పండుగ పురస్కరించుకొని ముస్లిం సోదరుల ప్రార్థనలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం కదిరి పట్టణంలోని ఈద్గా మైదానంలోని ప్రత్యేక ప్రార్థనా స్థలాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రార్థన స్థలంలో వర్షపు నీరు నిలువ ఉండకుండా దోమల నివారణకు ఫాగింగ్ తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు ఫయాజ్ అలీ ఖాన్, ఆల్ఫా ముస్తఫా, కృష్ణమోహన్‌నాయుడు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రార్థనా ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే

విత్తనశుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

ఖరీఫ్ సీజన్లో పంటసాగు చేసే రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని ఎఒ లోకేశ్వరరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం మండలకేంద్రానికి చెందిన రమణా రెడ్డి అనే రైతు పొలంలో వేరుశనగ విత్తన శుద్ధి, ఎరువులు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శిరీష, అగ్రికల్చర్ అసిస్టెంట్లు యుగంధర్, ధనలక్ష్మి, పిఇఒ హరి రైతులు పాల్గొన్నారు.

కదిరి అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

కూటమి తరపున ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై కదిరి నియోజకవర్గ అభివృద్ధికి పనిచేద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఎన్నికల పర్వంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై కూటమి తరపున కదిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన తన గెలుపునకు పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుందామనానరు. ఈనెల 16 న కదిరి సమీపాన గల పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఈ సమావేశానికి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, గంగయ్య నాయుడు, రాజశేఖర్ బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

ధర్మవరంలో టీడీపీ సంబరాలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలోని 33వ వార్డులో టీడీపీ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్, 33వ వార్డు టీడీపీ అధ్యక్షులు గోసలశ్రీరాములు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ఆధ్వర్యంలో ధర్మవరం నియోజకవర్గం అన్నివిధాలు అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్రగౌడ్, దుర్గాప్రసాద్, దామోదర్‌నాయుడు, హరి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సవితమ్మకు మంత్రివర్గంలో చోటు హర్షణీయం

ప్రజాశక్తి - బుక్కపట్నం

రాష్ట్ర మంత్రివర్గంలో కురుబ సామాజికవర్గానికి చెందిన పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మకు చోటు కల్పించడంపై సత్య సాయి జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలుగా ఎన్నికైన బీసీలకు, మంత్రి సత్య కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆసంఘం నాయకులు ఆదినారాయణ, కమ్మన్న, పార్థసారథి, కాటమయ్య, ఈశ్వరయ్య, నాగరాజు, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఈవీఎంలు వద్దు..బ్యాలెట్ ముద్దు'

హిందూపురం : దేశంలో అధికారంలో ఉన్న మతతత్వ బిజెపి పార్టీ ఈవీఎంలను అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని అందుకోసమే బిఎస్‌పి ఆధ్వర్యంలో ఈవిఎంలు వద్దు.... బ్యాలెట్ ముద్దు అనే నినాదంతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆపార్టీ రాష్ట్ర నాయకులు శ్రీరాములు అన్నారు. గురువారం పట్టణంలోని బిఎస్పి కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమిమంత్రివర్గంలో అగ్రవర్ణాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. 10 సంవత్సరాల బిజెపి పాలనలో దేశంలో ఎటువంటి అభివృద్ధి, సంక్షేమం జరగలేదని విమర్శించారు. ఎన్నో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిందన్నారు. అయినప్పటికీ అధికారంలోకి వాళ్లే రావడంపై ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. స్వతంత్రంగా ఉండవలసిన ఎన్నికల కమిషన్ ను వారి చేతుల్లోకి తీసుకుని ఈవీఎం లలో మాయాజాలాన్ని సృష్టించి అధికారంలోకి వస్తున్నారని ఆరోపించారు. 2014లో చంద్రబాబు నాయుడు మోడీకి జై అనడంతో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిందని. 2019 ఎన్నికల్లో చంద్రబాబు మోదీని వ్యతిరేకించడంతో జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారని అన్నారు. మళ్లీ 2024లో చంద్రబాబు మోడీ జై అనడంతో తిరిగి బాబు అధికారంలోకి వచ్చారని దీనినిబట్టి చూస్తే మోడీకి జై అంటే వారు హీరోలు అవుతారని వ్యతిరేకిస్తే జీరోలు అవుతారని స్పష్టమవుతోందన్నారు. పట్టణంలోని దండు రోడ్డులో ఉన్న బూత్ నెంబర్ 28లో కనీస బలం లేని కాంగ్రెస్ పార్టీకి 464 ఓట్లు రావడం ఇక్కడ బలంగా ఉన్న బిఎస్‌పి 5 ఓట్లు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. దీంతో పాటు అధికార వైసీపీకి కేవలం ఒక్క ఓటు రావడంపై ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. అందుకోసమే ఇవిఎంలను వ్యతిరేకిస్తూ బ్యాలెట్ పేపర్ తోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఇన్‌ఛార్జి కొల్లకుంట నాగరాజు, నాయకులు హరికుమార్, మూర్తి, ఎంఎల్ నారాయణ, మౌలాలి, ఖలందర్, బాబు, చిరంజీవి, నరసింహప్ప, సత్యప్ప, అంజినప్ప, వెంకట్రాముడు, గంగాధరప్ప, వెంకటేశ, పెద్దన్న, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

16న 'అక్షరాభ్యాసం'

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండల కేంద్రానికి సమీపంలో ఎం.కొత్తపల్లి బండపై వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామివారి దేవస్థానంలో ఈనెల 16న అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటుల ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి శుసిడిపిఒ వరలక్ష్మిని ముఖ్య అతిథిగా ఆహ్వానించినట్లు ఆయన చెప్పారు. 6 ఏళ్ల లోపు చిన్నారులకు 16న ఆదివారం 8 గంటల నుండి 10:30 వరకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించి, ఉచితంగా పలక,బలపాలు అందించనున్నామని వివరించారు.

భూయాజమాన్య హక్కు చట్టం రద్దుపై హర్షం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

గత రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ సిఎం చంద్రబాబునాయుడు సంతకాన్ని చేయడంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఇడప బత్తిని ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఆంధ్ర ప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు కోరుతూ చేసిన ఉద్యమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ చురుకైన పాత్ర పోషించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంలో ఈ చట్టాన్ని రద్దు చేయాలని రిట్ పిటీషన్ దాఖలు చేసి న్యాయ పోరాటం కూడా చేశామన్నారు. ప్రజల ఆస్తి హక్కును హరించే ఈ చట్టాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే రద్దు చేసి ప్రజల ఆందోళనను తగ్గించి, వారి ఆకాంక్షను నెరవేర్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ శాసనసభలో కూడా బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదింప చేయాలని కోరారు. ఇటీవల కాలంలో తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్న న్యాయవాదులపై భౌతిక దాడులు జరగటం బాధాకరమన్నారు. ఈ దాడులను అరికట్టడానికి న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకువచ్చే ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

చేనేత నైపుణ్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

చేనేత నైపుణ్య కోర్సులకు ఆసక్తిగల యువతి యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా జౌళి శాఖ డైరెక్టర్ రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెంకటగిరి లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో డిప్లమా కోర్స్ నందు ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 15 నుండి 23 సంవత్సరాలు వయసు కలిగిన పదవ తరగతి లేదా సమానమైన పరీక్షలలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇంటర్ ఎంపిసి గ్రూప్ లో పాస్ అయిన వారు పదవ తరగతితో పాటు రెండేళ్ల పాసైన వారు నేరుగా డిప్లమా సెకండ్ ఇయర్‌లో ప్రవేశించవచ్చన్నారు. షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థుల వయస్సు 25 ఏళ్ళ ఉండవచ్చన్నారు. మొదటి సంవత్సరంలో నెలకు వెయ్యి రూపాయలు, రెండో ఏడాది నెలకు 11వందల రూపాయలు, మూడవ ఏడాది నెలకు 12 వందల రూపాయలు స్టయిఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 20వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9866727042 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని చెప్పారు.